ఆంధ్రప్రదేశ్ ఎన్నికల షెడ్యూల్

- నోటిఫికేషన్ : 18-04-2024
- నామినేషన్ల గడువు : 25-04-2024
- నామినేషన్ల పరిశీలన : 26-04-2024
- ఉపసంహరణ : 29-04-2024
- పోలింగ్ తేదీ : 13-05-2024
- ఓట్ల లెక్కింపు : 04-06-2024

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
**జాతీయ వార్త**
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్

శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 45 | 3 బుధవారం ఏప్రిల్ 2024 | పేజీలు : 4 వెల: 7.00





# ఈఎస్ఐఎస్.. కార్మికులకు.. వరం

* అవగాహన లేక ఉచిత వైద్యసేవలకు చిరుద్యోగులు దూరం
* 21వేల లోపు వేతనమున్న వారు ఈఎస్ఐకు అర్హులు
* శస్త్ర చికిత్సలకు విశాఖ వెళ్లాల్సిందే
* గతంలో ఉన్న పానెల్ క్లినిక్‌లు ఎత్తివేత
* శ్రీకాకుళంలో డిస్పెన్సరీ, పైడిభీమవరంలోనే ఆసుపత్రుల ద్వారా సేవలు
* మళ్లీ ప్యానెల్ క్లినిక్‌లు పునరుద్ధరించాలంటున్న కార్మికులు

**(శ్రీకాకుళం - వార్త ప్రతినిధి)**

ఈఎస్ఐ పథకం అనేది రూ.21వేలు వరకు జీతం పొందే సంఘటిత రంగ కార్మికులకు ఆరోగ్య సౌకర్యాల ప్రయోజనాలను అందించే ఆరోగ్య పథకం. ఈ పథకం కింద ప్రైవేట్ ఉద్యోగాలు, ఫ్యాక్టరీలలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వస్తారు. విధి నిర్వహణలో ఉద్యోగి ప్రమాదానికి గురైతే, అతనికి ఈఎస్ఐ పథకం కింద చికిత్స సౌకర్యం కల్పిస్తారు. ఈ పథకం కింద ఉద్యోగి కుటుంబ సభ్యులకు కూడా వైద్యసేవలు అందిస్తారు. ప్రమాద బాధితుడు ఉద్యోగం కోల్పోతే, చికిత్స కష్టంగా మారితే, ఈ పథకం ఉపయోగపడుతుంది. ఈ ప్లాన్‌లో బీమా కవరేజీ ప్రయోజనం ఉద్యోగికి, అతని కుటుంబానికి అందిస్తారు. ఇందులో ప్రసూతి ప్రయోజనం కూడా ఉంది. పథకం కింద, చికిత్స, వైద్య సంరక్షణ అందిస్తారు.

అలాగే ఉద్యోగి పని సమయంలో మరణిస్తే, అతని కుటుంబానికి పెన్షన్ ఇస్తారు. ఈ పథకం ఉద్యోగుల స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తారు. 10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న కంపెనీలు, ఫ్యాక్టరీలు దీని పరిధిలోకి వస్తాయి. ఈఎస్ఐ ఆసుపత్రి ఒక ఉద్యోగిని పెద్ద ఆసుపత్రికి సూచిస్తే, అక్కడ కూడా పూర్తి చికిత్స, వైద్య సహాయం ఉచితంగా అందిస్తారు. అలాగే తక్కువ ఆదాయం ఉన్న ఉద్యోగులు, కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈఎస్ఐ కార్డు జారీ చేస్తుంది. డిస్పెన్సరీ లేదా ఆసుపత్రిలో ఉచిత చికిత్స పొందవచ్చు. ఆరోగ్యమే కాకుండా ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. ఈ కార్డు కలిగి ఉంటే మీరు ఏ వ్యాధి చికిత్స కోసం డబ్బు ఖర్చు చేయాల్సిన పనిలేదు. మీ కుటుంబ సభ్యుల వైద్య చికిత్సకు కూడా మీరు చెల్లించాల్సిన అవసరం లేదు. మీ ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మీ నెలవారీ జీతానికి కూడా సహాయపడుతుంది. అనారోగ్యం కారణంగా సెలవు తీసుకుంటే ఈఎస్ఐ

... మిగతా 3లో

## ఈఎస్ఐతో టైఆప్‌కు ప్రైవేట్ ఆసుపత్రుల అనాసక్తి..


శ్రీకాకుళంలో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు ఉన్నా ఈఎస్ఐతో టైఆప్ చేసుకోవడానికి ఆసక్తి కనబరచడం లేదు. దీనివల్ల కార్మికులకు వైద్యసేవలు మృగ్యంగా మారింది. ఈఎస్ఐ కార్పొరేషన్‌తో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు టైఅప్ చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ ఇటీవల టెండర్లు కూడా వేసింది. ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరింది. ఈఎస్ఐ వల్ల తమకు ఆర్థికపరంగా పెద్దగా ఉపయోగముండదన్న ఉద్దేశంతో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు దరఖాస్తు చేసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇకనైనా మండల స్థాయిలో ప్యానెల్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తే కార్మికులకు, చిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కార్మిక, ఉద్యోగ సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాయి.




## కొరవడిన అవగాహన...

ఈఎస్ఐపై కార్మికులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం వల్ల ప్రయోజనాలను అందుకోలేకపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న డిస్పెన్సరీల సేవలను వినియోగించకలేకపోతున్నారు. పలాసలో జీడి పరిశ్రమలు, ఉద్దానంలో కొబ్బరి పరిశ్రమలు, టెక్కలిలో గ్రానైట్ ఆధారిత పరిశ్రమలపై ఆధారపడి పెద్ద ఎత్తున కార్మికులు జీవనం సాగిస్తున్నారు. పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి వంటి ప్రాంతాల్లో ఈ డిస్పెన్సరీలు లేకపోవడంతో కార్మికులు ఉచిత వైద్యసేవలు పొందలేకపోతున్నారు. గతంలో ఆమదాలవలస, హిరమండలం, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం, నరసన్నపేట, రాజాం, శ్రీకాకుళంతో పాటు పలు ప్రాంతాల్లో ప్యానెల్ క్లినిక్‌లు ఉండేవి. వాటి ద్వారా ఆయా మండలాల పరిధిలో కార్మికులకు వైద్యసేవలు అందేవి. స్థానికంగా ఉన్న వైద్యులు వీటిని నిర్వహించేవారు. కార్మికులకు అవగాహన లేక ప్యానెల్ క్లినిక్‌లకు వెళ్లకపోవడంతో క్రమేణా అవి మూతపడ్డాయి. విశాఖపట్నంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఉంది. అక్కడ అన్ని రకాల వైద్యసేవలు, శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. కార్మికులు శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస తదితర ప్రాంతాల నుంచి విశాఖపట్నం వెళ్లి చికిత్స తీసుకునేందుకు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు. శ్రీకాకుళం జిల్లాలోని జెమ్స్ ఆసుపత్రిలో ఈఎస్ఐఎస్‌కి సంబంధించి సూపర్ స్పెషాలిటీకి సంబంధించిన వైద్యసేవలు మాత్రమే అందిస్తున్నారు. ప్రస్తుతం శ్రీకాకుళంలోని డిస్పెన్సరీ, పైడిభీమవరంలోని ఆసుపత్రుల్లో మాత్రమే కార్మికులకు వైద్యసేవలు అందిస్తున్నారు.

# పింఛన్ల పంపిణీపై.. సీఎం కుట్రలు



* ముందే నగదు విత్ డ్రా చేసి ఉంటే ఇబ్బంది ఉండేది కాదు * పింఛనుదారులకు ఇవ్వాల్సిన సొమ్ము కాంట్రాక్టర్లకు.. * టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు * రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ

3లో

# పొత్తుల ముఠాతో.. యుద్ధం చేస్తున్నా



* కుర్చీ కోసం పసుపుపతి అబద్ధాలు చెబుతున్నాడు * ఇప్పుడు మరోసారి ఇదే డ్రామా * మదనపల్లె బహిరంగ సభలో సీఎం జగన్

3లో

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 24 నుంచి వేసవి సెలవులు

*** జూన్ 11 వరకూ * 12 నుంచి తిరిగి బడులు**
*** ఉత్తర్వులు విడుదల చేసిన స్కూళ్ల విభాగం కార్యదర్శి**

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో బడులకు వేసవి సెలవులపై అధికారిక ప్రకటన వెలువడింది. ఈనెల 24 నుండి ఏపీలో స్కూళ్లకు సెలవులు ఇస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. జూన్ 11 వరకు వేసవి సెలవులుగా ప్రకటించిన విద్యా శాఖ.. వచ్చే అకడమిక్ ఇయర్ కోసం జూన్ 12న తిరిగి స్కూల్స్ తెరుచుకుంటాయని స్కూళ్ల విభాగం కార్యదర్శి సురేష్‌కుమార్ పేరిట విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎండల తీవ్రత నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'వాటర్ బెల్స్' మోగించాలని విద్యాశాఖ నిర్ణయించింది. విద్యార్థుల్లో డీహైడ్రేషన్ ముప్పును నివారించేందుకు రోజులో మూడు సార్లు బెల్స్ మోగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 8.45, 10.50, 11.50కి గంట కొట్టాలని పేర్కొంది. ఈ మేరకు అన్ని పాఠశాలలకు విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు లంచ్ బ్రేక్ ఇచ్చినట్లుగా 5 నిమిషాల పాటు వాటర్ బ్రేక్ ఇవ్వనున్నారు.

# విద్యతోనే ఉన్నత శిఖరాలు

### శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

**శ్రీకాకుళం, ఏప్రిల్2:** విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన పర్యటనలో భాగంగా రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో పర్యటించారు. తరగతిగదిలో విద్యార్థినీ, విద్యార్థులతో మాట్లాడుతూ చిన్నప్పుడు నుండి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సివిల్ సర్వీసెస్, జడ్జీలు మంచి ఇంజనీర్స్ గా మన ప్రాంతానికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎస్పీ జీఆర్ రాధిక, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



### కౌంటింగ్ కేంద్రం పరిశీలన

సాధారణ ఎన్నికలు - 2024 కోసం ఎచ్చెర్ల మండలం శివాని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్, జిల్లా ఎస్పీ జి.ఆర్ రాధిక ఇతర ముఖ్య అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈవీఎమ్, ఇతర అనుబంధ యూనిట్లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతతో పాటు, 24 గంటలు కాస్టింగ్ జరిగేలా సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ముందుస్తు ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సులువుగా వాహనాలు చేరుకునేలా నిర్మిస్తున్న రహదారి పనులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత కట్టుదిట్టమైన భద్రత మధ్య శివాని కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లకు తీసుకొని వస్తారని, రిసప్షన్ కేంద్రం వద్ద ఈవిఎమ్ లను స్వీకరించి, ఒక నిర్ధిష్టమైన రూట్‌లో ఆయా నియోజక వర్గాలకి కేటాయించిన స్ట్రాంగ్ రూమ్ లకి తరలించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా బ్యాలెట్ యూనిట్ లను రిసెప్షన్ కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూం వరకు తీసుకుని వొచ్చే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కలర్ కోడ్ ఇవ్వాలని సూచించారు. జిల్లా ఎస్పి జి.ఆర్ రాధిక పోలీసు బందోబస్తు పరంగా అన్ని విధాల భద్రతా చర్యలు తీసుకోవడం, కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వాహనాలకు ఎలాంటి ట్రాఫిక్ లేకుండా, సులువుగా చేరుకునేలా జిల్లా ఎన్నికల అధికారితో సమన్వయం చేసుకోవడం లాంటి అంశాలపై వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు, శ్రీకాకుళం ఆర్డీవో సిహెచ్ రంగయ్య, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, పలువురు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పరిశీలనకు హాజరయ్యారు.





## న్యాయం చేస్తా.. ఆందోళన వద్దు

### కలమటకు చంద్రబాబు హామీ

**పాతపట్నం ఏప్రిల్2:** మీకు న్యాయం చేస్తామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తికు హామీ ఇచ్చినట్టు తెలుస్తుంది. ఇటీవల పాతపట్నం నియోజకవర్గం టీడీపీ టికెట్‌ను మామిడి గోవిందరావుకు కేటాయించడంపై కలమట వెంకటరమణమూర్తి తో పాటు నియోజకవర్గ కాడర్ అంతా అధికమొత్తంలో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. దీంతో ఇటీవల జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు దగ్గర నుంచి కలమటకు జాతీయ కార్యాలయానికి పిలుపువచ్చింది. తన అనుచరులతో మంగళవారం హైదరాబాదులో చంద్రబాబుతో కలమట భేటీ అయ్యారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని కింద స్థాయిలో పరిస్థితుల గూర్చి చంద్రబాబుకు కలమట వివరణ ఇచ్చారు. న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్టు కలమట వర్గీయులు చెబుతున్నారు.

## ఉపాధ్యాయుడు సస్పెన్షన్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 2:** ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయుని సస్పెండ్ చేశామని జిల్లా విద్యాశాఖాధికారి వేంకటేశ్వర రావు తెలిపారు. శ్రీకాకుళం తుమ్మావీధి మునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పప్పాలా సత్యనారాయణ మార్చి 17న తోలాపిలో రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు పేపర్లో వచ్చినందున విచారణ చేపట్టిన మండలం విద్యాశాఖాధికారి ధ్రువీకరించ డంతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు స్పష్టం కావడంతో సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పేర్కొన్నారు.

## 15 మంది వలంటీర్ల రాజీనామా

**విజయనగరం, ఏప్రిల్ 2:** జిల్లాలో ఇప్పటివరకు 15 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకా ధికారి నిర్మలాదేవి తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన దగ్గరనుంచి ఏప్రిల్ 1 వరకు, జిల్లాలో వలంటీర్లకు సంబంధించి మొత్తం 29 ఫిర్యాదులు అందాయని, వీరిలో 14 మందిని ఇప్పటివరకు తొలగించగా, మిగిలిన 15 మంది రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

## టీడీపీ కార్యాలయం ప్రారంభం

**శ్రీకాకుళం టౌన్, ఏప్రిల్2:** శ్రీకాకుళం నగరంలోని విశాఖ ఏ కాలనీలో నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని జనసేన, బీజేపీ నేతలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ తదితరులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గొండు శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ఏర్పాటైందన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి వైసీపీ విధ్వంసకర పాలనకు తెరదించుతామని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి వేణుగోపాల్ మాట్లాడుతూ, దేశంలో బీజేపీ సొంతంగా 370 స్థానాలు గెలుచుకుంటుందన్నారు. జనసేన నియోజకవర్గ ఇంచార్జి కోరాడ సర్వేశ్వర రావు మాట్లాడుతూ వైసీపీ విముక్త నియోజకవర్గంగా శ్రీకాకుళంను నిలపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన మున్సిపల్ మాజీ కౌన్సెలర్ పుట్ట వెంకటేశ్వరరావు, పలువురు మత్స్యకార నాయకులకు పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హెటిరోకు ఆదిత్య విద్యార్థులు

**శ్రీకాకుళం టౌన్, ఏప్రిల్ 2:** నగరంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో గల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రముఖ ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ క్యాంపస్ ఇంటర్వ్యూను మంగళవారం నిర్వహించింది. 300 మంది విద్యార్థులు హాజరవ్వగా 14 మంది తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. వి.వేణు గోపాల్ తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రతీ ఏడాది క్యాంపస్ ఇంట ర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఈ విద్యాసంవత్సరంలో సుమారు 45 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 4వేల మంది ఆదిత్య విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. తమ శ్రీకాకుళం బ్రాంచీల నుంచి 450 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని తెలిపారు.





## కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటాం

**ఎచ్చెర్ల, ఏప్రిల్ 2:** ఎన్డీఏ కూటమి విజయం ఖాయమని, బీజేపీ ఎచ్చెర్ల నియోజకవర్గ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, టీడీపీ విజయనగరం పార్లమెంట్ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడులను గెలిపించుకుంటామని ఎచ్చెర్ల మండల టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం అభ్యర్థులతో కలిసి కూటమి నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, విజయనగరం పార్లమెంటు ఉపాధ్యక్షురాలు బల్లాడ అరుణా రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావులు మాట్లాడుతూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తే అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. ఎన్ఈఆర్, అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజా సేవకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని, ప్రజలకు నిరంతరం అందు బాటులో ఉంటామన్నారు. సమావేశంలో అన్నెపు భువనేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి, వావిలపల్లి రామకృష్ణ, బచ్చు కోటిరెడ్డి, బోర శ్రీనివాసరావు, సత్యనారాయణ, రామారావు, గట్టెం శివరాం, మెండ రాజారావు, అల్లుబిల్లి రాంబాబు, పైడి అన్నంనాయుడు, సంపతిరావు నాగేశ్వరరావు, తమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## గొట్టాబ్యారేజీలో డెడ్‌స్టోరేజీ

**హిరమండలం, ఏప్రిల్ 2:** వంశ ధార జలాశయంతో పాటు గొట్టాబ్యారేజీ డెడ్ స్టోరేజీకి చేరుకుంది. నీటి నిల్వలు అడుగంటాయి. మరో మూడు నెలల్లో మరింత స్థాయికి తగ్గిపోయే పరిస్థితి ఉంది. జిల్లాతో పాటు ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో ఆశించిన వర్షాలు లేకపోవడంతో గొట్టాబ్యారేజీతో పాటు రిజర్వాయర్ అడుగంటిపోయింది. గొట్టాబ్యారేజిలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజి 34.88 లెవల్ కాగా, ప్రస్తుతం 35.5 మీటర్ల లెవల్‌లో నీటిమట్టం స్థాయి ఉంది. వంశధార జలాశయంలో సుమారు 2 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ఈ రెండు మూడు నెలల్లో వర్షాలు కురియకపోతే గొట్టా బ్యారేజీతో పాటు వంశధార జలాశయం పూర్తిగా ఎండి పోయే పరిస్థితి ఉంది.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

## నేటి నుంచి 6 వరకూ పింఛన్ల పంపిణీ

**అమరావతి:** ఏపీలో పింఛన్ల పంపిణీపై ఎన్నికల సంఘం విధి విధానాలు ఖరారు చేసింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈఓ ఆదేశాలను సవరిస్తూ ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది. బుధవారం నుంచి ఏప్రిల్ 6 వరకు కేటగిరీల వారీగా పంపిణీ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. కొందరికి ఇంటివద్దే ఇవ్వడంతోపాటు, మిగిలిన వారికి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. దివ్యాంగులు, తీవ్ర అనా రోగ్యంతో బాధపడేవారు, అస్వస్థతకు గురైనవారు, వితంతువులకు ఇంటివద్దే పింఛన్ ఇవ్వాలని నిర్ణయించింది. గ్రామ సచివాలయాలకు దూరంగా ఉన్న గిరిజన ప్రాంతాల వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.27 లక్షల సిబ్బంది ఉన్నట్టు గుర్తించిన ప్రభుత్వం.. సరిపడా ప్రభుత్వ ఉద్యోగులు లేకపోవటంతో రెండు కేటగిరీలుగా పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ సచివాలయాలు పనిచేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ నెల 3 తేదీ మధ్యాహ్నం నుంచి ప్రారంభించి ఏప్రిల్ 6 నాటికి పంపిణీ ముగించాలని ఆదేశించింది.

## పింఛన్ల పంపిణీపై..
# సీఎం కుట్రలు



* ముందే నగదు విత్ డ్రా చేసి ఉంటే ఇబ్బంది ఉండేది కాదు
* పింఛనుదారులకు ఇవ్వాల్సిన సొమ్ము కాంట్రాక్టర్లకు..
* టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు * రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ

**అమరావతి:** రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ రాశారు. 'పింఛన్ల పంపిణీ బాధ్యతను సీఎం సరిగా నిర్వహించట్లేదు. వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఎన్నికలకు ముందు పింఛన్ల పంపిణీపై కుట్రలు చేస్తున్నారు. వాలంటీర్లతో నగదు పంపిణీ బాధ్యతలను ఈసీ తప్పించింది. ప్రభుత్వ ఉద్యోగులతో ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వాలని ఈసీ చెప్పింది. ముందే బ్యాంకుల నుంచి నగదు విత్ డ్రా చేసి ఉంటే ఇబ్బంది ఉండేది కాదు. పింఛనుదారులకు ఇవ్వాల్సిన సొమ్ము కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు. నిధుల కొరత వల్లే పింఛన్ల పంపిణీ జాప్యం చేస్తున్నారు. పింఛన్ల పంపిణీపై లబ్ధిదారులకు నమ్మక ద్రోహం చేస్తున్నారు. జగన్ ప్రభుత్వం కుంటిసాకులు చెప్పడం రాజకీయ కుట్రే" అని లేఖలో పేర్కొన్నారు.

### నేటి నుంచి రెండో విడత 'ప్రజాగళం'

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన ప్రజాగళం పర్యటనలకు రెండో విడత షెడ్యూల్ ఖరారైంది. బుధవారం నుంచి ఐదు రోజుల పాటు ఆయన పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఏప్రిల్ 3న కొత్తపేట, రామచంద్రాపురం, 4న కొవ్వూరు, గోపాలపురంలో రోడ్‌షోలో పాల్గొంటారు. 5న నరసాపురం, పాలకొల్లు, 6న పెదకూరపాడు, సత్తెనపల్లి, 7న పామర్రు, పెనమలూరులో ప్రజాగళం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు సాయంత్రం 4గంటలకు తొలి సమావేశం, 6గంటలకు రెండో సమావేశం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. తొలివిడతలో 15 నియోజకవర్గాల్లో ప్రజాగళం రోడ్ షోల్లో చంద్రబాబు పాల్గొన్నారు.

## పొత్తుల ముఠాతో..
# యుద్ధం చేస్తున్నా




* కుర్చీ కోసం పసుపుపతి అబద్ధాలు చెబుతున్నాడు
* ఇప్పుడు మరోసారి ఇదే డ్రామా
* మదనపల్లె బహిరంగ సభలో సీఎం జగన్

**అన్నమయ్య జిల్లా:** అధికారం కోసం చంద్రబాబు పసుపుపతిగా మారాడు.. అరుంధతి సినిమాలో పశుపతిలా తయారయ్యాడని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కుర్చీ కోసం పసుపుపతి నోటికి వచ్చిన అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఆరో రోజు దిగ్విజయంగా కొనసాగుతోంది. అన్నమయ్య జిల్లాలో దారిపొడవునా సీఎం జగన్‌ను జనం నీరాజనాలు పలికారు. మంగళవారం మదనపల్లె బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ.. 2014లో ఈ పసుపుపతి మూడు పార్టీలతో పొత్తు పెట్టుకున్నాడని ప్రస్తావించారు. ముగ్గురి ఫొటోలతో ఉన్న హామీల పత్రాలను ఇంటింటికి పంపించారని, ఆ హామీలను ఒక్కటేనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ఇప్పుడు మరోసారి ఇదే డ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. 2014 కంటే ఎక్కువ హామీలంటూ మరో డ్రామాకు తెరతీస్తున్నారని సీఎం జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ పేదల రక్తం పీల్చేందుకు వస్తున్న ఈ పసుపుపతిని ఎవరైనా నమ్ముతారా అని నిప్పులు చెరిగారు. రాష్ట్రాన్ని దోచుకోవాలని బాబు ప్లాన్ చేస్తున్నారని.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం వద్దన్న వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీసీల తోకలు కత్తిరిస్తానన్న బాబు తోక కత్తిరించాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ఓర్వలేక.. కోర్టులకు వెళ్లి మరీ అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు, పెత్తందారులకు కురుక్షేత్రం యుద్ధం జరగబోతుంది.. పొత్తుల ముఠాతో యుద్ధం చేస్తున్నాం.. మోసాలే అలవాట్లుగా అబద్ధాలే పునాదులుగా చేసుకున్న వారితో ఈ ఎన్నికల్లో మనం పోరాడుతున్నామని జగన్మోహనరెడ్డి అన్నారు. బాబు గెలిస్తే పెన్షన్లు, పథకాలు, వాలంటరీర్ వ్యవస్థ రద్దు చేస్తాడన్నారు. అవ్వతాతలకు పెన్షన్‌రాకుండా తన మనుషులతో పిటిషన్ వేయించాడు. బాబు గెలిస్తే పెన్షన్లు, పథకాలు, వాలంటరీ వ్యవస్థను రద్దు చేస్తాడన్నారు. పేదలకు మంచి చేసిన వైసీపీ ప్రభుత్వానికి మరోసారి అండగా నిలవాలని జగన్మోహనరెడ్డి కోరారు.



## జిల్లా వార్తలు

## ఈఎస్ఐఎస్. కార్మికులకు వరం

(మొదటిపేజి తరువాయి)

సాయంతో సెలవులో కూడా జీతం పొందవచ్చు. అనారోగ్యంతో ఉన్న సిబ్బందికి 91 రోజుల పాటు నగదు చెల్లింపు ఉంది. మీరు జీతంలో 70శాతం పొందుతారు. ఉద్యోగం పోయినప్పుడు మీకు చాలా సహాయం చేస్తుంది. మీరు ఈ కార్డును కలిగి ఉంటే, మీ ఉద్యోగం కోల్పోతే, మీరు నిరుద్యోగ భృతిపై జీవించవచ్చు. ఉద్యోగి మరణిస్తే, కుటుంబ సభ్యులను విడిచిపెట్టదు. కుటుంబంలోని ఇతర సభ్యులకు జీవితకాల పెన్షన్ అందించే పనిని చేస్తుంది. మృతుల కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయల వరకు ఇఎస్ఐ పింఛన్ సౌకర్యం కల్పిస్తుంది. మహిళా ఉద్యోగులు, కార్మికులు ప్రసూతి సెలవుపై కూడా జీతం పొందవచ్చు. మీరు ఇంట్లో నుంచే 26 నెలల సెలవును పూర్తి వేతనం పొందవచ్చు. ఇవి కాకుండా, వైకల్యం (తాత్కాలిక వైకల్యం, శాశ్వత వైకల్యం) సహా ఆధారపడిన వారి విషయంలో కూడా ఈ పథకం ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది మాత్రమే కాదు, అంత్యక్రియల ఖర్చులు, ప్రసూతి ఖర్చుల కోసం కూడా నిబంధన ఉంది.

శ్రీకాకుళం జిల్లాలో సుమారు 25వేల మందికి పైనే కార్మికులకు ఈఎస్ఐలో సభ్యత్వం ఉంది. ఇంకా చాలామంది 21వేలు కన్నా తక్కువ వేతనం పొందుతున్న కార్మికులు, ఉద్యోగులు జిల్లాలో ఉన్నా సభ్యత్వం తీసుకోకపోవడంతో ఈఎస్ఐ సేవలను పొందలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2019లో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పాలకొండ రోడ్డులో ఈఎస్ఐఎస్ బ్రాంచ్ కార్యాలయంతో పాటు డిస్పెన్సరీని ఏర్పాటు చేసింది. పైడిభీమవరంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఉంది. ఆ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు మాత్రమే సేవలు పొందుతున్నారు. శ్రీకాకుళంలో డిస్పెన్సరీ సేవలను నగరవాసులు మాత్రమే పొందుతున్నారు. నెలకు ఐదు వందల మంది ఇక్కడ సేవలు పొందుతున్నారు. ఈ డిస్పెన్సరీలో ఒక వైద్యుడు, నర్సింగ్ ఇన్‌చార్జీ, ఫార్మసిస్టు సేవలు అందిస్తున్నారు. ఇక్కడ ఉన్న బ్రాంచ్‌లో మేనేజర్‌తో పాటు ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరు కార్మికులకు నష్టపరిహారం పంపిణీ, సెలవులు పెట్టిన రోజులకు నగదు సాయం, తదితర సేవలు అందిస్తున్నారు. అలాగే ఈఎస్ఐ కార్డుకు ఆధార్ అనుసంధానం, ఈఎస్ఐఎస్ సేవలపై అవగాహన కల్పిస్తున్నారు.

## నేడు ఢిల్లీ, కోల్‌కతా
# మధ్య ఐపీఎల్ పోరు

* మైదానంలో ఢిల్లీ, కోల్‌కతా క్రికెటర్ల ప్రాక్టీస్
* ముస్తాబైన పీఎంపాలెం ఏసీఏ-వీడీసీఏ స్టేడియం * క్రీడాకారులను చూసేందుకు తరలివచ్చిన క్రీడాభిమానులు * స్టేడియం వద్ద భారీ బందోబస్తు



**విశాఖపట్నం:** ఢిల్లీ, కోల్‌కతా జట్ల మధ్య ఐపీఎల్ పోరుకు విశాఖపట్నం సిద్ధమైంది. ఇరుజట్లు మైదానంలో ప్రాక్టీస్ చేశారు. క్రీడాకారులను చూసేందుకు విశాఖ క్రీడాభిమానులు మైదానానికి తరలివచ్చారు. అయితే పోలీసులు వారిని లోపలికి అనుమతించలేదు. కాగా, బుధవారం జరిగే ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు తరలివచ్చే ప్రేక్షకులకు పోలీసులు కీలక సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్‌కు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు ఇచ్చారు. మ్యాచ్ వీక్షించ డానికి వచ్చే ప్రేక్షకులు తమ వాహనాలను తమకు నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. విశాఖపట్నం నగరం వైపు నుంచి స్టేడియానికి వచ్చే వీవీఐపీ, వీఐపీ వాహనదారులు ఎన్‌హెచ్ 16లో స్టేడియం వరకు ప్రయాణించి, ఏ గ్రౌండ్, బి గ్రౌండ్, వి కన్వెన్షన్ గ్రౌండ్‌లలో వారి పాస్ ప్రకారం చేరుకోవాలి. విశాఖ వైపు నుంచి స్టేడియానికి వచ్చే టికెట్ హోల్డర్లు ఎన్‌ఎచ్ 16లో ప్రయాణించి, స్టేడియం వద్ద ఉన్న హెూల్డ్ ఏజ్ జంక్షన్ వద్ద ఎడమ వైపు తిరిగి, సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి. శ్రీకాకుళం, విజయనగరం, ఆనంద పురం, గంభీరం, బోయ పాలెం, కొమ్మది వైపు నుంచి వచ్చేవారు కార్‌షెడ్ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి, సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ పార్కింగ్ గ్రౌండ్‌కు చేరుకోవాలి. లేదంటే కార్ షెడ్ జంక్షన్ నుంచి ఎడమవైపు తిరిగి మిథిలాపురి కాలనీ మీదుగా వచ్చి ఎంవీవీ సిటీ డబుల్ రోడ్డు, పోలిశెట్టి వేణుగోపాల్ రావు గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి. విశాఖపట్నం నగరం నుంచి లేదా భీమిలి వైపు నుంచి బీచ్ రోడ్డు మీదుగా స్టేడియానికి వచ్చే వారు ఐటీ సెజ్ మీదుగా వచ్చి ఎంవీవీ సిటీ డబుల్ రోడ్డుకు చేరుకొని పార్కింగ్ చేసుకోవాలి. విశాఖ నగరం నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు ఎన్‌హెచ్ 16లో రాకుండా బీచ్ రోడ్డులో వచ్చి ఐటీ సెజ్ మీదుగా వచ్చి లా కాలేజీ రోడ్డులో పార్కింగ్ చేసుకోవాలి. శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు మారికవలస, తిమ్మాపురం, ఐటీ సెజ్ మీదుగా వచ్చి లా కాలేజీ రోడ్డు చేరుకొని పార్కింగ్ చేయాలి.

జాతీయ **వార్త**
తెలుగు దిన పత్రిక



## పలువురు ఉన్నతాధికారులపై.. ఈసీ బదిలీ వేటు

**అమరావతి:** ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యంతో పాటు అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తోన్న అంశంపై కొందరు జిల్లా ఎస్పీలు, కలెక్టర్లపై ఈసీ బదిలీ వేటు వేసింది. ప్రధాని సభలో భద్రతా వైఫల్యాలకు సంబంధించి కూడా వేటు వేస్తూ ఆదేశాలిచ్చింది. ముగ్గురు ఐఏఎస్‌లతోపాటు, ఆరుగురు ఐపీఎస్‌లను బదిలీ చేసింది. వీరిలో ప్రకాశం ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డి, చిత్తూరు ఎస్పీ జాషువా, అనంతపురం ఎస్పీ అన్బురాజన్, నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఉన్నారు. ఓటర్ల జాబితాలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నారన్న ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారులుగా ఉన్న 3 జిల్లాల కలెక్టర్లపై కూడా వేటు వేశారు. ఐఏఎస్ అధికారుల్లో కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి రాజబాబు, అనంతపురం జిల్లా అధికారి గౌతమి, తిరుపతి ఎన్నికల అధికారి లక్ష్మీషా ఉన్నారు. ఈమేరకు ఈసీ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అత్యవసర నోట్ పంపింది.

## ఇన్స్పెక్టర్ రిషి.. ఆకట్టుకోలేదు!




**నటీనటులు:**
నవీన్ చంద్ర, సునైనా, కన్నా రవి, శ్రీకృష్ణ దయాళ్, మాలినీ జీవరత్నం, కుమారవేల్ తదితరులు, దర్శకుడు: జె ఎస్ నందిని, నిర్మాతలు: శుకదేవ్ లాహిరి, సంగీత దర్శకులు: అశ్వత్

ఇటీవల ఓటీటి కంటెంట్‌గా మన సౌత్ నుంచి రానున్న ఓ సిరీస్ ఇంట్రెస్టింగ్ ట్రైలర్ తో ఆసక్తి రేపింది. నటుడు నవీన్ చంద్ర మెయిన్ లీడ్ లో నటించిన ఆ సూపర్ నాచురల్ థ్రిల్లర్ సిరీస్‌నే "ఇన్స్పెక్టర్ రిషి". తమిళ్ లో తెరకెక్కించిన ఈ సిరీస్ తెలుగు సహా పాన్ ఇండియా భాషల్లో ఇప్పుడు అమెజాన్ యాప్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కి వచ్చింది. మరి ఈ సిరీస్ ఓటీటి వీక్షకులని మెప్పించిందా లేదా అనేది సమీక్షలో చూద్దాం రండి.

**కథ..**

ఇక ఈ సిరీస్ కథలోకి వస్తే.. కోయంబత్తూర్ తేంకాడు అనే ఓ దట్టమైన అటవీ ప్రాంతమైన గ్రామంలో ప్రజలు అనుమానాస్పద రీతిలో మరణిస్తూ ఉంటారు. ఈ మిస్టరీని ఛేదించేందుకు క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రిషి నందన్(నవీన్ చంద్ర) అలాగే సబ్ ఇన్స్పెక్టర్ అయ్యానార్ (కన్నా రవి), చైత్ర (మాలిని జీవరత్నం) లు రంగంలోకి దిగుతారు. మరి ఆ గ్రామంలో జరుగుతున్న మిస్టరీ మరణాలు వెనుక ఉన్నది ఎవరు? ఆ అడవి ప్రజలు దేవతగా కొలిచే వనరాచినే ఇవన్నీ చేస్తుందా లేక అసలు కారణాలు ఏంటి? వీటికి ఓ పరిష్కారం దొరికిందా లేదా? రిషి ఇన్వెస్టిగేషన్‌ని ఛేదించాడా అనేది తెలియాలి అంటే ఈ సిరీస్ చూడాలి.

**ప్లస్ పాయింట్స్..**

ఈ సిరీస్ లో నటీనటులు మాత్రం సాలిడ్ పెర్ఫామెన్స్ లు అందించారు అని చెప్పాలి. మొదటిగా నవీన్ చంద్ర నుంచే చెప్పుకుంటే ఇప్పటికే తాను చాలా ఇంటెన్స్ పాత్రలు పోషించాడు. కొన్ని సిన్సియర్ అటెంప్ట్స్ లో ఈ రిషి రోల్ కూడా ఒకటని చెప్పాలి. తన కేసు విషయంలో కమిట్ అయ్యి ఎంత దూరమైనా వెళ్లగలిగే సిన్సియర్ పోలీస్‌గా ఈ సిరీస్ లో తాను ఆకట్టుకుంటాడు. అలాగే నటి సునైనా డీసెంట్ పాత్రలో కనిపిస్తుంది. ఓ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా తనలోని లోతైన హావభావాలను వ్యక్తం చేసింది. ఇక వీరితో పాటుగా ఇతర ముఖ్య పాత్రధారులు మాలిని జీవరత్నం, కన్నా రవి, శ్రీకృష్ణ దయాల్ తదితరులు తమ పాత్రలకి న్యాయం చేకూర్చారు.

**మైనస్ పాయింట్స్..**

ఈ సిరీస్ లో పెద్ద డిజప్పాయింటింగ్ అంశం ఏదన్నా ఉంది అంటే అసలు ఈ సిరీస్ కథాంశమే అని చెప్పాలి. చాలా రోటీన్ గా ఆల్రెడీ చూసినట్టుగానే ఈ సిరీస్ లో లైన్ అనిపిస్తుంది. ఒక ప్రాపర్ థ్రిల్లర్, హారర్ కానీ సస్పెన్స్ ఎలిమెంట్స్ ఇందులో అసలు ఏమాత్రం ఆకట్టుకోవు. ట్రైలర్ లో కొన్ని సీన్స్ ఆసక్తిగా అనిపించి ఉండొచ్చు కానీ సిరీస్ చూస్తే అసలు వాటిలో మేటర్ లేదని అర్థం అయ్యిపోతుంది. ఇంకా ఈ సిరీస్‌ని అనవసరంగా బాగా సాగదీసినట్టుగా అనిపిస్తుంది. ముఖ్యంగా మొదటి 5 ఎపిసోడ్స్ అయితే దారుణంగా సాగదీశారు. వీటితో చూసే ఆడియెన్స్ కి బాగా బోర్ అనిపిస్తుంది. అలాగే ఈ ఒక్క సిరీస్ ని కంప్లీట్ చెయ్యడానికి 8 గంటలు సమయం కేటాయించాలి. కానీ మొత్తం చూసాక ఈ సమయమంతా వృధా అనిపించక మానదు. అలాగే హారర్ ఎలిమెంట్స్ ఏమాత్రం మెప్పించవు ఆల్రెడీ చూసేసినట్టుగానే అనిపిస్తాయి దీనితో అసలు కొత్తదనం కనిపించదు. సస్పెన్స్ ఫ్యాక్టర్ మైంటైన్ చేయడంలో కూడా ఈ సిరీస్ విఫలం అయ్యింది. వీటితో పాటుగా కొన్ని సీన్స్ లో అసలు నేటివిటీ మిస్ అయ్యినట్టు అనిపిస్తుంది. జెనరల్ గా డబ్ వెర్షన్ లో ఆయా నేటివిటీకి తగ్గట్టుగా మార్పులు ఉండాలి కానీ డబ్బింగ్ వెర్షన్ లో కూడా ఒరిజినల్ వెర్షన్ ని ఉంచేశారు. ఇక ఈ సిరీస్ లో ఎక్కువ పాత్రలు వాటి సబ్ ప్లాట్ లు లాంటివి మరింత నీరసం తెప్పిస్తాయి.

**సాంకేతిక వర్గం..**

ఈ సిరీస్‌లో నిర్మాణ విలువలు బాగున్నాయి. మెయిన్‌గా ఆర్ట్ వర్క్ ఇంప్రెస్ చేస్తుంది. పలు సెట్టింగ్స్ నాచురల్ విజువల్స్ బాగున్నాయి. టెక్నీకల్ టీం లో మ్యూజిక్ వర్క్ బాగాలేదు. ఈ తరహా సిరీస్ లకి ప్రభావవితం చేసే నేపథ్య గీతం ముఖ్యం అది ఏమాత్రం ఆకట్టుకోదు. సినిమాటోగ్రఫీ బాగానే ఉంది. ఎడిటింగ్ లో చాలా సీన్స్ కట్ చేయాల్సింది. తెలుగు డబ్బింగ్ ని ఇంకా బెటర్ గా చేయాల్సింది. ఇక దర్శకులు జే ఎస్ నందిని విషయానికి వస్తే.. తాను ఏదో అనుకోని థ్రిల్ చేయడానికి ట్రై చేసిన ఈ సిరీస్‌లో అది తప్ప అనవసర అంశాలు ఎక్కువయ్యిట్టుగా అనిపిస్తుంది. వీటితో తన వర్క్ ఈ సిరీస్ కి నిరాశపరుస్తుంది. చాలా వీక్ కథా, కథనాలతో తాను ఈ సిరీస్ ని డల్ గా నడిపించారు.

**తీర్పు..**


ఇక మొత్తంగా చూసినట్టు అయితే ఈ "ఇన్స్పెక్టర్ రిషి" లో నవీన్ చంద్ర మరోసారి నటుడుగా ఆకట్టుకుంటాడు అలాగే తనతో పాటుగా ఇతర పాత్రధారులు మంచి పెర్ఫామెన్స్ లు అందించారు కానీ అల్టిమేట్ లో సిరీస్ లో విషయంలో తేలిపోయింది. దీనితో కొందరిలో అయినా మంచి ఆసక్తి రేకెత్తించిన ఈ సిరీస్ ఓవరాల్ గా బాగా డిజప్పాయింట్ చేస్తుంది. సరైన కథా, కథనాలు సిరీస్ లో లోపించాయి. వీటితో ఈ సిరీస్ కి దూరంగా ఉండడమే మంచిది.




## 'పుష్ప 2 ది రూల్' పోస్టర్ రిలీజ్

### ఈనెల 8 టీజర్, ఆగస్టు 15న చిత్రం విడుదల

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో, స్టార్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ పుష్ప 2 ది రూల్. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంను ఆగస్ట్ 15, 2024న వరల్డ్ వైడ్‌గా పాన్ ఇండియా బాషల్లో రిలీజ్ చేయనున్నారు మేకర్స్. అయితే ఈ సినిమాకి సంబందించిన టీజర్ విడుదలపై మేకర్స్ భారీ అప్డేట్ ను రిలీజ్ చేశారు. బన్నీ పుట్టిన రోజు సందర్భంగా ఏప్రిల్ 8, 2024 న టీజర్ ను రిలీజ్ చేయనున్నారు మేకర్స్. ఇదే విషయాన్ని ఒక పవర్ ఫుల్ పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఈ పోస్టర్ ఆడియెన్స్ ను, ఫ్యాన్స్ ను విశేషం గా ఆకట్టుకుంటుంది. జాతర సీక్వెన్స్ కి సంబందించిన బన్నీ గెటప్ పోస్టర్ ఇది. కేవలం కాలు మాత్రమే కనిపించేలా పోస్టర్ ను విడుదల చేసారు. అయితే టీజర్ లో జాతర సీక్వెన్స్ కి సంబందించిన కట్ ఉండే అవకాశం ఉంది. ఇక బన్నీ బర్త్ డే కి ఫ్యాన్స్ కి మాస్ ఫీస్ట్ అని చెప్పాలి. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవి శంకర్ లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఫాహద్ ఫజిల్, అనసూయ భరద్వాజ్, ధనంజయ, సునీల్, రావు రమేష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



## కమెడియన్ విశ్వేశ్వరరావు కన్నుమూత

ప్రముఖ నటుడు, కమెడియన్ అయిన విశ్వేశ్వరరావు కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, చెన్నైలో తుదిశ్వాస విడిచారు. 350 చిత్రాలకు పైగా ఆయన నటించి, ప్రేక్షకులను అలరించారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్, మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ రజనీకాంత్, కింగ్ నాగార్జున, పవన్ కళ్యాణ్ లాంటి స్టార్ హీరో చిత్రాల్లో నటించారు. చెన్నైలోని సిరుసేరులో ఉన్నటువంటి నివాసంలో ఆయన పార్థివ దేహాన్ని ఉంచారు. బుదవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. విశ్వేశ్వరరావు మృతి పట్ల పలువురు అభిమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# బెంగళూరును ఓడించిన లఖ్‌నవూ

* నిప్పులు చెరిగిన మయాంక్ * లఖ్‌నవూ 181 * బెంగళూరు 153 పరుగులకు ఆలౌట్

**బెంగళూరు:** ఐపీఎల్ 2024లో భాగంగా బెంగళూరుతో జరిగిన పోరులో లఖ్‌నవూ 28 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 182 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన బెంగళూరు 19.4 ఓవర్లలో 153 పరుగులకే ఆలౌట్ అయింది. బుల్లెట్ వేగంతో బంతులు విసురుతూ ఈ ఐపీఎల్‌లో ఆకర్షణగా నిలిచిన మయాంక్ యాదవ్ రెండో మ్యాచ్‌లోనూ సంచలన బౌలింగ్‌తో అదరగొట్టాడు. మూడు వికెట్లు (3/14) తీసి ఆ జట్టు పతనాన్ని శాసించాడు. బెంగళూరు బ్యాటర్లలో మహిపాల్ లోమ్రోర్ (33) టాప్ స్కోరర్. రజత్ పటిదార్ (29), విరాట్ కోహ్లీ (22), డుప్లెసిస్ (19) పరుగులు చేశారు. మ్యాక్స్‌వెల్ (0), కామెరూన్ గ్రీన్ (9), అనుజ్ రావత్ (11), దినేశ్ కార్తిక్ (4) ఘోరంగా విఫలమయ్యారు. లఖ్‌నవూ బౌలర్లలో నవీన్ ఉల్ హక్ 2, సిద్ధార్థ్, యశ్ ఠాకూర్, స్టొయినిస్ తలో వికెట్ తీశారు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (81బీ 56 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) జట్టు భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. మార్కస్ స్టొయినిస్ (24), కేఎల్ రాహుల్ (20) పరుగులు చేశారు. చివర్లో నికోలస్ పూరన్ (40లిబీ 21 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. బెంగళూరు బౌలర్లలో మ్యాక్స్‌వెల్ 2, రీస్ టాప్లీ, యశ్ దయాల్, సిరాజ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



**రెండు మ్యాచ్‌లను రీషెడ్యూల్ చేసిన బీసీసీఐ**

ఐపీఎల్ 17వ సీజన్‌లో రెండు మ్యాచ్‌లను బీసీసీఐ రీ షెడ్యూల్ చేసింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కోల్‌కతా, రాజస్థాన్‌ల మధ్య మ్యాచ్ ఈనెల 17న ఈడెన్ గార్డెన్స్‌లో జరగాల్సిఉంది. కానీ, అదేరోజు శ్రీరామనవమి ఉండటంతో మ్యాచ్‌కు కావాల్సినంత భద్రత కల్పించలేమని బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్)కు పోలీసులు తెలియజేశారు. దీంతో ఈ మ్యాచ్‌ను ఒకరోజు ముందు (ఏప్రిల్ 16న) నిర్వహించనున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. అదేవిధంగా అహ్మదాబాద్ వేదికగా ఏప్రిల్ 16న గుజరాత్, ఢిల్లీ మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను మరుసటి రోజు (ఏప్రిల్ 17న) నిర్వహిస్తామని పేర్కొంటూ ఈమేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది.

Printed and published on behalf of KOTA CHANDRASEKHAR and printed at K R road srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at K R road srikakulam. Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor:shaik sahid E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9160000247